ఉచిత కంటి వైద్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వీరవాసరం: రాయకుదురు శ్రీ ఉమా మూలేశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ ఆనందసాయి ఛారిటబుల్ ట్రస్ట్ భీమవరం వారి సౌజన్యంతో పాలకొల్లు నేత్ర కంటి ఆసుపత్రి వారి సహకారంతో శివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో 93 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఐదుగురికి కంటి ఆపరేషన్లు చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వరరావు, దేవస్థానం ఛైర్మన్ కాయల నానిబాబు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు అడబాల రామకృష్ణుడు, కటకం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వేతన వెతలు..!

జీతాలందక పంచాయతీ కార్మికులు గగ్గోలు
పెండింగులో ఏడు నుంచి 14 నెలలు బకాయిలు
ఇల్లు గడవక కార్మికుల అవస్థలు వర్ణనాతీతం
పెదవేగి మండలంలో పరిస్థితి మరీ దారుణం
15వ ఆర్థిక సంఘం నిధులను లాగేసుకోవడమే కారణం
వేతనాలు చెల్లించాలని అధికారులకు వినతులు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

పంచాయతీ కార్మికుల వేతన కష్టాల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు ఏడు నుంచి 14 నెలలుగా జీతాలు అందని పరిస్థితి నెలకొంది. ఇచ్చే అరకొర జీతం సైతం నెలలు తరబడి పెండింగులో పెట్టడంతో కార్మికుల అవస్థలు వర్ణనాతీతం. జీతాలందక ఆర్థిక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 800కుపైగా పంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలోనూ పారిశుధ్యం, చెత్త సేకరణ, వీధిలైట్లు వేసేవారు, తాగునీరు వదిలే సిబ్బంది వంటి పనుల్లో కార్మికులు పని చేస్తుంటారు. మేజర్ పంచాయతీలో ఎక్కువ మంది ఉండగా మైనర్ పంచాయతీలో తక్కువగా ఉంటారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న పంచాయతీల్లో రెండు వేల మందికిపైగా కార్మికులు పని చేస్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీ కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విద్యుత్ బిల్లుల బకాయిల పేరుతో లాగేసుకుంది. దీంతో పంచాయతీలన్నీ ఆర్థిక కష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అభివృద్ధి పనుల సంగతి పక్కన పెడితే కనీసం కార్మికులకు వేతనాలు సైతం ప్రతినెలా ఇవ్వలేని పరిస్థితికి పంచాయతీలు చేరాయి. గ్రామ పంచాయతీలో పని చేసే కార్మికులందరికీ పంచాయతీ నిధుల నుంచే జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఆర్థిక సంఘం నిధులు లేకపోవడంతో కార్మికులకు జీతాలు ఇవ్వకుండా పెండింగ్ పెడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఏలూరు జిల్లా పెదవేగి మండలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దాదాపు వంద మంది వరకూ సిబ్బంది మండలంలోని పంచాయతీల్లో పని చేస్తున్నారు. కార్మికులెవరికీ జిఒ ప్రకారం జీతాలు అందడం లేదు. అంతేకాకుండా సెలవులు అనేవి లేకుండా నెలలో 30 రోజులు పని చేయిస్తున్నారు. జీతాలు సకాలంలో ఇస్తున్నారా అంటే అదీ లేదు. దీంతో పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెదవేగి మండలంలోని కూచింపూడి పంచాయతీలో 24 నెలలుగా కార్మికులకు జీతాలు అందలేదు. జగన్నాథపురం పంచాయతీలో 16 నెలలుగా, జానంపేట, పెదవేగి పంచాయతీల్లో తొమ్మిది నెలలు, రాట్నాలకుంట, బి.శింగవరం పంచాయతీల్లో ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఇక్కడే కాకుండా జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కామవరపుకోట, పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ తదితర మండలాల్లోనూ పెద్దఎత్తున పంచాయతీ కార్మికులకు వేతన బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటంతో తమకు జీతాలు అందించి ఆకలి బాధలు తీర్చాలంటూ కార్మికులు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. కార్మికులు, సంఘం నాయకులు సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇక నుంచి ప్రతినెలా ఒకటి, రెండు తేదీల్లోనే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. నెలలు తరబడి జీతాలు లేకపోవడంతో ఇంటిని ఎలా నెట్టుకురావాలో తెలీక కార్మికులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు జీతాలు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

నిర్ణీత సమయంలో పరిష్కరించాలి : కలెక్టర్

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి – భీమవరం

స్పందనలో అందిన ప్రతి దరఖాస్తునూ నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ఆమె జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి 196 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులకు ఆనందం కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా సమస్య పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతిరోజూ స్పందనపై పది నిమిషాలు సమయం కేటాయిస్తే ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, భీమవరం డిఎస్‌పి బి.శ్రీకాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం: స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి డివిజన్ నుండి వచ్చిన 39 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని సూర్యతేజ ఆదేశించారు. అందిన అర్జీల్లో భూసమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, హౌసింగ్, భూమి తగాదాలు, మత్స్య, వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశుసంక్షేమం తదితర సమస్యలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాకు రేషన్ ఎప్పుడిస్తారు..

తహశీల్దార్ కార్యాలయం వద్ద కోడిపందేల దిబ్బ వాసుల ధర్నా

వినతిపత్రం అందిస్తున్న కోడిపందేల దిబ్బ వాసులు

ప్రజాశక్తి – పెనుగొండ

ఫిబ్రవరి నెల ప్రారంభమై 13 రోజులైనా తమకు రేషన్ ఇవ్వకపోవడం ఏమిటని కోడిపందేల దిబ్బ కాలనీ వాసులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఇక తమకు రేషన్ ఇచ్చేది ఎప్పుడని నినదించారు. తమ కాలనీ ఏర్పాటై 14 సంవత్సరాలైందని, సుమారు ఐదు వందల కుటుం బాలు అక్కడ నివశిస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వాపోయారు. ధర్నా అనంతరం తహశీల్దార్ ఎన్.గురుమూర్తిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై తహశీల్దార్ జోక్యం చేసుకుని తక్షణం ఆ ప్రాంత ప్రజలకు రేషన్ అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేత మాదాసు నాగేశ్వరరావు మాట్లాడుతూ కాలనీ ప్రజలకు రోడ్లు, వీధిలైట్లు, డ్రెయినేజీ సౌకర్యం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. గర్భిణులకు అంగన్‌వాడీ సేవలు సక్రమంగా అందడం లేదని, ఆ ప్రాంతంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆ ప్రాంత మహిళలు తహశీల్దార్‌కు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ బాదుషా, ప్రజలు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి రేసులో నంద్యాల సీతారామయ్య!

కాపు కోటాలో ఇవ్వాలని అధినేతలకు విన్నపాలు

పాదయాత్రలో జగన్‌కు సత్కరిస్తున్న నంద్యాల సీతారామయ్య (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి – ఆకివీడు

జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిక్కెట్ రేసులో స్థానిక వైసిపి నేత నంద్యాల సీతారామయ్య ఉన్నారు. ఎలాగైనా టిక్కెట్ దక్కించుకునేందుకు వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, కాపుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు నంద్యాల సీతారామయ్య ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయన మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. వైసిపి ఆవిర్భావం నుండి క్రియాశీల కార్యకర్తగా ఉంటూ ఇప్పటికే అనేక పదవులు చేజిక్కించుకున్నారు. ఆకివీడు వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకమండలి సభ్యులుగా 2022 చివరి వరకు పని చేశారు. టిక్కెట్ కోసం ఇప్పటికే పార్టీ ప్రముఖులను కలిసినట్లు సమాచారం. వైసిపి ఉండి నియోజకవర్గ కన్వీనర్ పివిఎల్.నర్సింహరాజు నుంచి అధిష్టానంలో ఒకరైన వైవి.సుబ్బారెడ్డి వరకూ ముఖ్యనేతలను కలిసి టిక్కెట్‌ను అభ్యర్థించినట్లు ప్రచారం సాగుతోంది. జిల్లాలో పాదయాత్రకు వచ్చిన జగన్‌ను ఆకివీడు నుండి రూట్ మార్చి కుప్పనపూడి మీదుగా భీమవరం తీసుకెళ్లారు. ఇప్పటివరకు ఎంఎల్‌సిగా ఉన్న మంతెన సత్యనారాయణరాజు (పాందువ్వ శ్రీను) పదవీ కాలం పూర్తవడంతో నియోజకవర్గంలో ఎంఎల్‌ఎగాని, ఎంఎల్‌సిగాని లేని పరిస్థితి. సత్యనారాయణరాజును టిడిపి ఆనాడు క్షత్రియ సామాజిక తరగతి నుండి ఎంపిక చేసింది. వైసిపి ప్రస్తుతం క్షత్రియ సామాజిక తరగతి నుండి ఆ స్థాయిలో ఉన్న పాతపాటి సర్రాజు క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్నారు. పివిఎల్ డిసిసిబి ఛైర్మన్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో కాపు సామాజిక తరగతికి చెందిన వారికి టిక్కెట్ ఇవ్వాలనే వాదన తెరపైకి వస్తోంది. ఈ నేపథ్యంలో సీతారామయ్య టిక్కెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఆశాలపై వేధింపులు ఆపాలి

కాళ్ల పిహెచ్‌సి వద్ద ధర్నాలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ
సమస్యల పరిష్కారానికి వైద్యాధికారి హామీ

కాళ్ల పిహెచ్‌సి ఆవరణలో బైఠాయించిన ఆశాలు

ప్రజాశక్తి – కాళ్ల

విధులకు సంబంధం లేని పనులను ఆశా వర్కర్లచే చేయిస్తూ పెరిగిన అధికారుల వేధింపులు వెంటనే ఆపాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఆశాలు సోమవారం స్థానిక పిహెచ్‌సి వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆశా వర్కర్లు మాట్లాడుతూ తమ సమస్యలను వివరించి కన్నీటిపర్యంతమయ్యారు. ఆశాల పట్ల వైద్యాధికారి గులాబ్ రాజ్‌కుమార్ వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలని నినదించారు. ఈ సందర్భంగా పోశమ్మ మాట్లాడుతూ ఆశాలపై ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం పనిభారం పెంచుతుంటే మరోవైపు అధికారుల వేధింపులు పెరగడం బాధాకరమన్నారు. ఆశాలను సచివాలయాలకు అనుసంధానం చేసి సేవలు పెంచడంతో పని ఒత్తిడి పెరిగి తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారని చెప్పారు. ఆశాలకు నిర్దిష్ట పని గంటలంటూ ఏమీ లేవని, రాత్రనక, పగలనక పని చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తోందన్నారు. 60 ఏళ్ళు నిండిన ఆశాలను రాష్ట్ర ప్రభుత్వం రిటైర్‌మెంట్ పేరుతో ఇంటికి పంపేస్తోందని, అయితే ఆశాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించడం లేదని విమర్శించారు. కాళ్ల పిహెచ్‌సిలో పని చేస్తున్న 53 మంది ఆశా వర్కర్లు కొంతకాలంగా వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వైద్యాధికారి, సిబ్బందితో సహా అంతా ఆశా వర్కర్లను తీవ్రంగా హింసిస్తున్నారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సబ్ సెంటర్ల దగ్గర ఉండాలని, వాళ్లున్నారో.. లేరో తనిఖీకి వైద్య సిబ్బందితో వీడియో కాల్స్ చేయించడం, ఆశాలు పర్మిషన్లు అడిగితే గంటలు తరబడి నిరీక్షణ చేయించడం, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సెలవు కోసం వెళ్తే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై అనేక సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఆశాల ఆందోళనతో ఆశాల సమస్యల పరిష్కారానికి వైద్యాధికారి గులాబ్ రాజ్‌కుమార్ కొన్ని హామీలు ఇచ్చారు. ఆశాలు గంటలు తరబడి నిరీక్షించే సమస్య లేకుండా చూస్తామని, దుర్భాషలాడబోమని, కిందిస్థాయి అధికారులతో మాట్లాడి తమ వైపు ఉన్న లోపాలను సరి చేసుకుంటామని రాజ్‌కుమార్ హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని యూనియన్ నాయకులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి.కళ్యాణి, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి, జిల్లా కార్యదర్శి దిగుపాటి జ్యోతి, మండల అధ్యక్షురాలు రెడ్డిదేవి, మండల కార్యదర్శి పెద్దిబోయిన కృష్ణవేణి, కోశాధికారి ఎన్.రేవతి, వి.పైడితల్లి, యు.రజిని, ఇ.లక్ష్మి, సిహెచ్.చిట్టిమరియ, సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, పలు గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్యాధికారితో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ

సమస్యల పరిష్కారం కోరుతూ విఒఎల ధర్నా



వినతిపత్రం అందిస్తున్న విఒఎలు

ప్రజాశక్తి – తణుకు రూరల్

విఒఎల తొలగింపు కోసం తీసుకొచ్చిన కాలపరిమితి సర్క్యులర్, గ్రూపుల మెర్జింగ్ వంటి వాటిని రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో విఒఎలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి విఒఎలు రూపాయి వేతనం లేకుండా పని చేశారన్నారు. ఎన్నో పోరాటాల తర్వాత రూ.10 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకుండా కేవలం రూ.8 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వారు పెట్టిన పథకాలు, విధానాలు అందరి వద్దకు తీసుకెళ్లే విఒఎలు నేడు చిన్నచూపునకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విఒఎల పట్ల నిరంకుశంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. వీరికి ఇచ్చే రూ.8 వేలు కూడా నెలలు తరబడి పెండింగ్ ఉంటున్నాయన్నారు. మహిళలు వారి కాళ్లపై వారు ఎన్నో అవమానాలు ఎదుర్కొని విఒఎలుగా పని చేస్తున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు వేధింపులకు గురిచేయడం సిగ్గు చేటన్నారు. గతంలో ఇచ్చిన కాల పరిమితి సర్క్యులర్, మెర్జింగ్ పేరుతో తొలగించడం ఆపాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని ప్రతాప్ హెచ్చరించారు. విఒఎల జిల్లా అధ్యక్షులు అడవి నిర్మలాదేవి మాట్లాడుతూ తాము ప్రభుత్వం, అధికారులు చెప్పిన పనులన్నీ చేస్తున్నా తమను ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు కామన మునిస్వామి, లీలావతి, పార్వతి, పద్మ, దేవి, రత్నకుమారి, దుర్గ, లక్ష్మి, రాజేశ్వరి, బేబీరాణి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

ఉద్యోగ భద్రత కోరుతూ పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి – పెనుగొండ

తమకు కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించి కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతూ పెనుగొండ పంచాయతీ కార్మికులు సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులపై పని భారం తగ్గించాలని, అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలుగా పంచాయతీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం కట్టు బానిసలుగా చేసి పని చేయించుకుంటుందని విమర్శించారు. కనీస వేతనాలు లేకుండా, సంక్షేమ పథకాలు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయకుండా వేతనాలు సవరించకుండా పనిచేయించుకోవడం దుర్మార్గమన్నారు. పంచాయతీ వారు 10 నెలలుగా కొబ్బరి నూనె, సబ్బులు, అందజేయడం లేదని, ప్రతి సంవత్సరం ఇవ్వాల్సిన యూనిఫారాలు, జోళ్లు ఇవ్వడం లేదని కార్యదర్శిని నిలదీశారు. కార్మికులకు సెలవులు ఇచ్చే విషయంలో వేధిస్తున్నారని, పని భారం పెంచి మహిళలచే మురుగు బోదెలుగా మారిన పంట కాలువల్లో పని చేయాలని వేధిస్తున్నారన్నారు. పనిచేసే క్రమంలో ప్రమాదం జరిగితే తమకు సంబంధం లేదంటూ ఇష్టమైతే పని చేయండి లేకపోతే మానేయండి అనడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ఈ సమస్యలు తక్షణం పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెనుగొండ పంచాయతీ కార్యదర్శి నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

17వ తేదీ వరకూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన : కలెక్టర్

ప్రజాశక్తి – భీమవరం

ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. బ్యాంకు కాంటాక్ట్ నెంబర్లు, డెబిట్, క్రెడిట్ కార్డుల గురించి, ఒటిపి, సివిసి, పాస్‌వర్డ్, పిన్, బ్యాంక్ ఖాతా ఇతర వ్యక్తిగత వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదని ఈ కార్యక్రమంలో వివరిస్తారని కలెక్టర్ తెలిపారు. బ్యాంకుల్లో డిజిటల్ సేవలు సౌకర్యంగా, సురక్షితంగా ఉంటాయని, వీటిని వినియోగించుకునే సమయంలో మోసాలకు గురికాకుండా డబ్బు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సురక్షితమైన ఆర్థిక వ్యవస్థ నిర్వహించడమే సురక్షితమని తెలిపారు. బ్యాంకు నుండి రుణం పొందేందుకు సులభతర పరిష్కారం ఉందని, నియంత్రణ సంస్థల నుండి మాత్రమే రుణం తీసుకోవాలని, అప్పు తీసుకునే ముందు వారి గురించి తెలుసుకోవాలని, అన్ని వివరాలు, నిబంధనలు జాగ్రత్తగా చదివి వడ్డీ ఇతర వివరాలు తెలుసుకోవాలని అన్నారు. ఫోన్‌లోని గోప్యమైన సమాచారం కాంటాక్టులు, మెసేజ్, లొకేషన్, కెమెరా, గ్యాలరీ వంటి మొదలైన వాటిని ఎవరైనా వాడేందుకు యాక్సెస్‌కు అనుమతించే ముందు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఎల్‌డిఎం రమణ, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, భీమవరం డిఎస్‌పి వి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, జెసి, ఇతర అధికారులు

బ్యాంకులు పొదుపు సొమ్ము ఇవ్వాలి: ఐద్వా

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

డ్వాక్రా మహిళలు తమ ఖాతాల్లో దాచుకున్న పొదుపు సొమ్మును వెంటనే వారికి ఇవ్వాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేతా పద్మజ, పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ సమావేశం సోమవారం కేతా పద్మజ అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవనంలో జరిగింది. సమావేశంలో పూర్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిమహిళ డ్వాక్రా సంఘాల్లో ఉన్నారని, ప్రతినెలా దాచుకున్న సొమ్ము కోట్లలో బ్యాంకుల్లో ఉందని తెలిపారు. తమ అవసరాల మేరకు ఆ పొదుపు సొమ్ము ఇవ్వాలని బ్యాంకుకు వెళ్లి కోరినా ఇవ్వడం లేదని మహిళలు వాపోతున్నారన్నారు. పొదుపు అడ్డు పెట్టుకుని రుణం ఇస్తామంటున్నారు తప్ప పొదుపు సొమ్ము మాత్రం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పొదుపు సొమ్మును వెంటనే వెనక్కి ఇవ్వాలని కోరారు. ఈ నెల 25, 26 తేదీల్లో మహిళలను రాజకీయంగా చైతన్యపరచటానికి రాజకీయ శిక్షణ తరగతులు తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నేతలు బంకుర యశోద పావని, కొత్తూరి నాగరత్నం, బాసిన శ్యామల, సిహెచ్.వరలక్ష్మి, అడ్డాల మీనాకుమారి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్లెక్సీలు తొలగించాలి

సిబ్బందికి తహశీల్దార్, ఎంపిడిఒ ఆదేశం

ప్రజాశక్తి – పెనుమంట్ర

ఈ నెల తొమ్మిదో తేదీన స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో గ్రామాల్లోని ఫ్లెక్సీలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలను తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎలిజిబెత్

బాల్య వివాహాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి గ్రామంలోనూ బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ సిడిపిఒ మేరీ ఎలిజిబెత్ అన్నారు. పెనుమంట్ర ప్రాజెక్టు పరిధిలోని ఇరగవరం హైస్కూల్‌లో బాల్య వివాహాలు, ఫోక్సో చట్టంపై కిశోర బాలికలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎలిజిబెత్ మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధ చట్టం కమిటీలో ఎంపిడిఒ, తహశీల్దార్, ఎస్ఐ, ఐకెపి ఎపిఎం, ఐసిడిఎస్ సిడిపిఒ, సూపర్‌వైజర్లు కమిటీ సభ్యులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఇరగవరం ఎంపిడిఒ ఎస్.కృష్ణమోహన్, తహశీల్దార్ బి.మాలతి, ఎస్ఐ చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ వై.మౌనిక, ఐకెపి ఎపిఎం కె.పుష్పావతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.కాంతకుమారి, డివి.మాణిక్యాంబ, సిహెచ్.నాగలక్ష్మి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించడం అందరి బాధ్యత అని ఐసిడిఎస్ మార్టేరు సెక్టార్ సూపర్ వైజర్ ఆర్.నాగలక్ష్మి అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మార్టేరు పంచాయతీ వద్ద సర్పంచి మట్టా కుమారి అధ్యక్షతన బాల్య వివాహాల నిర్మూలనపై కిషోర బాలికలకు, మహిళలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల వచ్చే సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌డి ఉమాదేవి, ఎఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.



స్పందనలో వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

సెల్ టవర్ నిర్మాణం ఆపాలని ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని తూర్పుపాలెం పంచాయతీ పరిధిలో పడమటిపాలెం నివాసాల మధ్యలో ప్రజలకు హాని కలిగించే సెల్ టవర్ నిర్మాణం వెంటనే ఆపాలని, గ్రామానికి దూరంగా నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ సర్పంచి గుబ్బల ఉషారాణి భర్త వీరబ్రహ్మంకు చెందిన సొంత స్థలంలో లాభాపేక్షతో టవర్ నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్నారన్నారు. స్థానికుల అభిప్రాయాలను సేకరించకుండా పంచాయతీలో తీర్మానం చేశారన్నారు. టవర్ ప్రభావం వల్ల ప్రజలకు రోగాలు సంభవిస్తాయన్నారు. అధికారులు గుర్తించి నిర్మాణ పనులను వెంటనే ఆపాలని కోరారు. గ్రామస్తుల నుంచి ఆర్‌వి కృష్ణారావు అర్జీ తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఇ-పంట నమోదులో వల్లూరి శ్రీధర్, బి.సంధ్య

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఒక్క రైతు ఇ-పంట నమోదు చేసుకోవాలని రైతు భరోసా కేంద్రం జాయింట్ డైరెక్టర్ వల్లూరి శ్రీధర్ అన్నారు. మండలంలోని పాములపర్రులో మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య అధ్యక్షతన రబీ పంటకు సంబంధించి సోమవారం నిర్వహించిన ఇ-పంట నమోదు కార్యక్రమంలో వల్లూరి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పంట పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. సొంతంగా పండిస్తున్న, కౌలుకు ఇస్తున్న రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట నమోదు చేయించుకున్న ప్రతి ఒక్క రైతుకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలన్నీ అందుతాయన్నారు. పంట నమోదు చేయించుకోని రైతుల నుంచి ధాన్యం సేకరణ, ఇన్‌పుట్, అవుట్ పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం వంటివి వర్తించవని చెప్పారు. ప్రతి ఒక్క రైతు పంట నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాస్, ఉద్యానవన సహాయకులు వై.దీప్తి, గ్రామ రెవెన్యూ అధికారి జి.ప్రసాద్ పాల్గొన్నారు.

మొగల్తూరులో...

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి పాలనలో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్తూరు రామరాజు విమర్శించారు. మొగల్తూరులోని వడియారుపేటలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబు పాలన తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తిమండ ముత్యాలరావు, పన్నపల్లి శివ, రాంబాబు, గోపాలం, పెచ్చెట్టి నాగేశ్వరరావు, పంపన శ్రీకృష్ణ భగవాన్, చల్లబోయిన పెద్దిరాజు, వెలిది పుల్లారావు, పితాని శేఖర్ పాల్గొన్నారు.

ఆచంట : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందని ఎంపిటిసి సభ్యులు తమ్మినేడి పృధ్వీకుమార్ అన్నారు. ఆచంటలో టిడిపి కార్యకర్తలు, కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి మన రాష్ట్రానికి ఇదేం ఖర్మ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో పృధ్వీకుమార్ మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల పేదలకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయిందన్నారు. రాష్ట్రంలో టిడిపిని అధికారంలోకి తీసుకువచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ అధ్యక్షులు నెక్కంటి ప్రభాకర్, దేవి కేతా మురళి, పాలాకుమార్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

'ఎస్ఆర్‌కెఆర్'కు వెంకయ్యనాయుడు అభినందన

కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వసతులపై, ఇక్కడ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలపై మాజీ ఉప రాష్ట్రపతి తన ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారని కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు, సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్ఆర్‌కె.నిశాంత్‌వర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు తెలిపారు. కళాశాల వార్షికోత్సవానికి, ఎఐసిటిఇ ఐడియా ల్యాబ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన వెంకయ్యనాయుడుకు కళాశాల యాజమాన్యం, స్టాఫ్, విద్యార్థుల తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కళాశాలలో పురాతన వస్తువులతో ఏర్పాటు చేసిన సృజనవాటికను ఆయన మరింతగా అభినందించి ప్రతి కళాశాలలో ఇటువంటిది ఏర్పాటు చేస్తే భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారని వారు చెప్పారు. కళాశాల విద్యార్థులు సైతం ఎంతో క్రమశిక్షణగా కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు తమ వంతు కృషి చేశారని తెలిపారు. సాంస్కృతిక కళల పట్ల విద్యార్థులకు ఉన్న ఆసక్తికి అద్దం పట్టే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు సాగాయన్నారు. కార్యక్రమం విజయవంతం చేయడంలో భీమవరం పోలీసు, రెవెన్యూ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి రంగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు

కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి - పెంటపాడు

స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో పెంటపాడు మండల కమిటీ సమావేశం అల్లు సుబ్బారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీన ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు సంబంధించి కేటాయింపు లేదన్నారు. లేబర్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, పిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కార్మికుల అన్ని సమస్యలపై ఏప్రిల్ ఐదో తేదీన ఢిల్లీ నగరంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ రంగాల నుంచి పెద్ద ఎతున ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లారెడ్డి, నాగేశ్వరరావు, సత్తి కోదండరామిరెడ్డి, దూలం ప్రసాద్, రమేష్ కె.అరుణ, కనక బంగారయ్య పాల్గొన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - తణుకు రూరల్

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బిఎ.సాల్మన్‌రాజు డిమాండ్ చేశారు. తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో ఎపిటిఎఫ్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా శాఖ అధ్యక్షులు జి.ప్రకాశం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను విడుదల చేయాలని, ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బివి.నారాయణ, ఉపాధ్యక్షులు అల్లం వీరభద్రరావు, కె.రాంబాబు, కార్యదర్శులు వి.రామమోహన్, కోట రామప్రసాద్, పిఎస్‌వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

మినిస్ట్రీస్ సేవలు అభినందనీయం



వంటసామగ్రి అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, మల్లిక దంపతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడిలో జీసస్ మినిస్ట్రీస్ అధ్యక్షులు మణి, పుష్ప పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కర్రి మురళీశ్రీనివాసరెడ్డి ఈ వేడుకలో పాల్గొని మాట్లాడారు. మినిస్ట్రీస్ నాయకులు ప్రశాంత్ కుమార్, ఊటిపల్లి రాజ్, సాకమణి, మరియమ్మ ఆర్థిక సాయంతో నెగ్గిపూడి ఎంపిపి పాఠశాలకు వంట సామగ్రి అందించారు. రూ.ఐదు వేల విలువైన వస్తువులను మురళీ శ్రీనివాస్ రెడ్డి, మల్లిక దంపతుల చేతుల మీదుగా స్కూల్ యాజమాన్యానికి అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మినిస్ట్రీస్ సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం స్కూల్ పిల్లలకు తిను బండారాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సమాజ సేవకుడు, మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సాకరాజు, సంఘం ఉపాధ్యక్షులు నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సరోజినీనాయుడు జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో సరోజినీనాయుడు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ భారత కోకిలగా పేరొందిన సరోజినీ నాయుడు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు అని, కవయిత్రి అన్నారు. అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహా సభలకు తొలి మహిళా అధ్యక్షురాలని, స్వతంత్ర భారత తొలి మహిళా గవర్నర్‌గా పని చేశారని చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆమె పాత్ర ముఖ్యమైందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ ఆమె పాత్ర మరువలేనిదని చెప్పారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థులకు బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రిమూర్తులు, చంద్రకళ, భవాని దుర్గ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సరోజినీదేవికి జయంతి వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముగిసిన కుష్టు నివారణ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు సత్యసాయి నగర్‌లో జనవరి 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్న స్పర్శ (కుష్టు రోగ నివారణ) పక్షోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పాలకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్వం సరైన మందులు లేక, రోగులకు అవగాహన లేక వికలాంగులుగా మారి ప్రతిరోజు నరక ప్రాయంగా జీవిస్తున్నారన్నారు. ఈ పరిస్థితి ఎవరికీ కలగకూడదని చెప్పారు. పరిశుభ్రత పాటించి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే కుష్టు రోగం ఎవ్వరికీ సోకదన్నారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జక్కంపూడి రామప్రసాద్ మాట్లాడుతూ ఎండిటి మందులు వచ్చిన తర్వాత ఈ రోగం పూర్తిగా అదుపులోకి వచ్చిందన్నారు. అయినా ఇంకా కొత్త కేసులు వస్తూనే ఉన్నాయని చెప్పారు. రోగిని తొలిదశలోనే గుర్తించి మందులు వాడటం వల్ల రోగం పూర్తిగా నయం అవుతుందని, దీనికి అందరూ ఆసుపత్రి సిబ్బందికి సహకరించాలని కోరారు. శ్రీనివాస్ రోగులను సన్మానించగా, రామ ప్రసాద్ బిర్యానీ పాకెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి సజన, అంగన్‌వాడీ టీచర్, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఆశ గంగా పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ భద్రాజీ

ప్రజాశక్తి - ఆచంట

శైవ క్షేత్రమైన ఆచంటీశ్వరుని కళ్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ అన్నారు. సన్నిధిలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్ల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని, వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ భద్రాజీని దేవస్థానం ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, ట్రస్టీలు కోట వెంకటేశ్వరరావు, అడ్డాల సూర్యప్రసాద్, సత్యవరపు మధుసూదనరావు, కోటిచుక్కల సుబ్బారావు, అమ్మనమంచి సుబ్రహ్మణ్యేశ్వరి, అలజంగి లక్ష్మీదేవి, అల్లాడి పద్మ, బండి వెంకటలక్ష్మి, సంకరమంచి ఉమామహేశ్వరరావు, వైసిపి నాయకులు కోట వెంకటేశ్వరరావు శాలువతో సత్కరించారు.

ఆచంటేశ్వర క్షేత్రంలో ఈ నెల 16వ తేదీ నుంచి 20వ వరకు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పెనుగొండ సిఐ జివివి.నాగేశ్వరరావు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి సోమవారం దేవాలయంలో పాలకవర్గ సభ్యులు, దేవాలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పెద్దఎత్తున సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కూడా సహకరించాలని కోరారు. ప్రతి ప్రోగ్రాం వద్ద ఒక ట్రస్టీ, ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉంటారని తెలిపారు. ప్రతి ప్రోగ్రాం వీడియో తీయించాలని, ఎవరైన ఇబ్బంది పెడితే కేసులు పెడతామని తెలిపారు. ఈ విషయాలన్నీ ముందుగానే మైక్ ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో దేవస్థానం ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, ట్రస్టీలు కోట వెంకటేశ్వరరావు, అడ్డాల సూర్యప్రసాద్, సత్యవరపు మధుసూదనరావు, కోటిచుక్కల సుబ్బారావు, అమ్మనమంచి సుబ్రహ్మణ్యేశ్వరి, అలజంగి లక్ష్మీదేవి, అల్లాడి పద్మ, బండి వెంకటలక్ష్మి, సంకరమంచి ఉమామహేశ్వరరావు, వైసిపి నాయకులు కోట వెంకటేశ్వరరావు, దేవస్థానం సిబ్బంది మేకా గోపాలకృష్ణ పాల్గొన్నారు.



దేవస్థానాన్ని పరిశీలిస్తున్న భద్రాజీ

విధుల్లోకి తీసుకోవాలని డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సూర్యమిత్ర కంపెనీ తొలగించిన డ్రైవర్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని పరిశ్రమ వద్ద డ్రైవర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి అల్లూరి అరుణ్ మాట్లాడుతూ జీతభత్యాలు తగ్గించవద్దని అడిగినందుకు సూర్యమిత్ర యాజమాన్యం దుర్మార్గంగా పది మంది డ్రైవర్లను తొలగించడం దారుణమన్నారు. పరిశ్రమ అభివృద్ధి కోసం ఎంతో శ్రమిస్తున్న డ్రైవర్లపై ఇటువంటి కక్ష సాధింపు సరికాదన్నారు. గత ఐదు నెలల నుంచి ఉద్యోగాలు లేక డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వారి కుటుంబ పరిస్థితులు అగమ్యగోచరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఐదు నెలల నుంచి యాజమాన్యంతో చర్చలు చేసినా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. సమస్య పరిష్కారయ్యేవరకూ పరిశ్రమ వద్దే ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. యాజమాన్యం వారు సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతలు గల వ్యక్తులని, అటువంటి యాజమాన్యం వారు తమ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వారు స్పందించి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆక్వా పరిశ్రమల వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గుండాబత్తుల కోటేశ్వరరావు, యూనియన్ నాయకులు ఎ.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, శంకర్, సురేష్, కోటేశ్వరరావు, రాము, బాబి పాల్గొన్నారు.

సూర్యమిత్ర కంపెనీ వద్ద ధర్నా చేస్తున్న డ్రైవర్లు

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.11.99 లక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మవారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించామని ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. యాత్రికులు 40 రోజులుగా అమ్మవారికి చెల్లించుకున్న కానుకలు, మొక్కుబడి రూపంలో హుండీ ఆదాయం రూ.11,99,209 సమకూరిందని ఆయన తెలిపారు. ఈ లెక్కింపును కాళ్ల వెంకటేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి చాగంటి సురేష్ నాయుడు పర్యవేక్షణలో నిర్వహించామని చెప్పారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సీజ్డ్ వాహనాలకు నేడు వేలం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మద్యం కేసుల్లో సీజ్ చేసిన వివిధ వాహనాలకు ఈ నెల 14వ తేదీ మంగళవారం వేలం పాట నిర్వహించనున్నట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాటదారులు నేరుగా రూరల్ స్టేషన్‌కు వచ్చి హెచ్చు ధరకు పాట పడుకుని డబ్బులు చెల్లించి వాహనాలను పొందాలని ఆయన సూచించారు.

In The Court Of The 1st Additional Junior Civil Judge : Tanuku
O.S.No. 89/2021

Between:
Karri Prabhakara Reddy ...*Plaintiff*
Vs
Pithani Anantha Nagaraju ...*Defendant*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాది: పితాని అనంత నాగరాజు, తండ్రి: రంగారావు, హిందువు, పురుషుడు, 40 సం॥లు, ఉద్యోగం డో.నెం. 5-172, గుబ్బల కేశవరావు గారి వీధి, Opp. Y-Not షాపింగ్ మాల్, పాలంగి గ్రామం, ఉండ్రాజవరం మండలం.

పై నెంబరు దావా గ్రంధములో మరియు ఐ.ఎ.నెం. 111/2021లో ప్రతివాదులైన మీకు ఎన్నిపర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.21-02-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు** మీరు **స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

ఎ.రవి కుమార్
అడ్వకేట్, తణుకు.

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, భీమవరం, ప॥గో॥జిల్లా
F.D.I.A. No. 2/2018 in
O.S. No. 74/2016

పిటీషనర్లు/ వాదులు:
1. పోసెపల్లి భారతి
2. మద్ది శకుంతల

అండ్

రెస్పాండెంట్లు/ ప్రతివాదులు:
1. పొదిలాపు సూర్యనారాయణ
2. పొదిలాపు జవహర్‌లాల్
3. బొర్రా రామకృష్ణ

ప్రత్యామ్నాయ నోటీసు

To:
3వ రెస్పాండెంట్: 1. బొర్రా రామకృష్ణ, S/o. మంగయ్య, వయస్సు 61 సం॥లు, హిందూ, మగ, వ్యవసాయం, నివాసం: మడుగు పోలవరం, వీరవాసరం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో 3వ రెస్పాండెంట్ అయిన మీకు అనేక పర్యాయములు కోర్టు వారు నోటీసులు పంపినప్పటికీని అవి మీరు అందుకొనని కారణముగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబర్ పిటీషన్‌లో మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు **ది. 01-3-2023వ తేదీకి** వాయిదా వేసియున్నారు. కావున ఆరోజున మీరు పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై మీయొక్క అభ్యంతరములు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంధములు జరుపబడును.

ఇట్లు
కట్టా ప్రసాద్, సెల్: 9346285989
వేదాల నాగరాజు, సెల్:9849344698
భీమవరం, పిటీషనర్ల తరపున న్యాయవాదులు
14-02-2023. భీమవరం

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, భీమవరం, ప॥గో॥జిల్లా
I.A. No. 330/2022
F.D.I.A. No. 2/2018 in
O.S. No. 74/2016

పిటీషనర్లు/ వాదులు:
1. పోసెపల్లి భారతి
2. మద్ది శకుంతల

అండ్

రెస్పాండెంట్లు/ ప్రతివాదులు:
1. పొదిలాపు సూర్యనారాయణ
2. పొదిలాపు జవహర్‌లాల్
3. బొర్రా రామకృష్ణ

ప్రత్యామ్నాయ నోటీసు

To: 3వ రెస్పాండెంట్: 1. బొర్రా రామకృష్ణ, S/o. మంగయ్య, వయస్సు 61 సం॥లు, హిందూ, మగ, వ్యవసాయం, నివాసం: మడుగు పోలవరం, వీరవాసరం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో అడ్వకేట్ కమిషనర్ అపాయింట్‌మెంట్‌ను కోరుతూ వేసిన పిటీషన్ నందు 3వ రెస్పాండెంట్ అయిన మీకు అనేక పర్యాయములు కోర్టు వారు నోటీసులు పంపినప్పటికీని అవి మీరు అందుకొనని కారణముగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై నంబర్ పిటీషన్‌లో మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు **ది. 01-3-2023వ తేదీకి** వాయిదా వేసియున్నారు. కావున ఆరోజున మీరు పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంధములు జరుపబడును.

ఇట్లు
కట్టా ప్రసాద్, సెల్: 9346285989
వేదాల నాగరాజు, సెల్:9849344698
భీమవరం, పిటీషనర్ల తరపున న్యాయవాదులు
14-02-2023. భీమవరం

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No. 183-186/GGMP-Grant & General Funds/2022-23, Dated: 13-02-2023

The Commissioner, Municipal Corporation, Eluru, invites tenders from interested, eligible bidders for **"Providing Borewell, Providing of (20W) LED Street Lights, Brackets and Clamp Sets, Repairs of Municipal Shopping Complex and Repairing of JCB & Compactor at Vehicle Depo. in Municipal Corporation, Eluru"** Total No of works is 4 with an amount of **Rs.19.26 Lakhs.**

Tender schedules are available on e-procurement market place from 15-02-2023. Last date of receipt of tenders is 22-02-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner Municipal Corporation, Eluru, Eluru District (Phone / Fax : 08812 - 245990)

Sd/- **COMMISSIONER,** Municipal Corporation, Eluru

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ)
రి.నెం. ABC-CS006/2015

H.O. : ABCCS Endowments Commissionerate Campus, Gollapudi, Vijayawada-521225. Phone: 0866-6650307
B.O. : ABCCS , D.No.23B-5-96/1, Edara Vari Street R.R.Peta, ELURU-534 002, Ph: 08812-249787

ఈ ప్రకటనలోని వారి తాలూకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తిపై సొసైటీ నందు తనఖా పెట్టి సొసైటీ నుంచి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు తనఖా పై సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజుల లోపుగా లిఖితపూర్వకంగా అభ్యంతరములను రిజిస్టరు పోస్టు విత్ ఎకనాలెడ్జ్‌మెంటు ద్వారా బ్యాంకుకు తెలియపర్చవలసినదిగా కోరుతున్నాము.

వ.సం.	పేరు	స్థిరాస్తి వివరం
1	Mrs. Kovvuri Srilakshmi, GL No. 60298, W/o. Sri Kovvuri Venkata Subba Rao, Cell: 9177511818 / 9399988286	The Property which is an extent of **238.05** Sq.Yds in three items (i.e., item no.1: **84.70** Sq. Yards, item no.2: **80.3/4** Sq. Yards & item no.3: **72.6** Sq. Yards) of house site along with RCC roofed Ground and First Floor & Vacant site building there in R.S.No. 582, Old Door No. 12-197, New Door No. 16-57, Near Kalidindi Railway Gate, Kaikaluru (V & GP), Eastwhile Krishna District, Present Eluru District, A.P-521333.

Eluru,
13-02-2023.
HRL SRINIVAS GORTHI,
Branch Manager. Cell No. 9502709946 / 9281029465